దుమ్మూధూళి మధ్యే వ్యాపారాలు

- కలుషితమవుతున్న సరుకులు
- మార్కెట్ ఏర్పాటు కోరుతున్న శనివారపుపేట వాసులు


శనివారపుపేట రోడ్డుపై వ్యాపారం చేస్తున్న దృశ్యం


నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలం

ఏలూరు రూరల్ : శనివారపుపేట పరిసరాల శ్రీరామ్‌నగర్, గవరవరం, రాజుల పేట, దొండపాడుతో పాటు శనివారపుపేట ప్రధాన ప్రాంతంలో సుమారు 30 వేల మంది జనాభా ఉన్నారు. వీరికి ఏళ్ల తరబడి మార్కెట్ సౌకర్యం లేదు. స్థానిక గాలి గోపురం పరిసరాల నుంచి నుంచి తమ్మిలేరుపై కట్టిన కాజ్‌వే వరకు రోడ్డు వ్యాపార కూడలిగా మారింది. ఈ రోడ్డులో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో మట్టి, చిప్స్, ఇటుకులు, రాళ్లు తరలించే టిప్పర్లు సైతం ఉన్నాయి. వీటి ద్వారా దుమ్మూధూళి వెదజల్లుతుంటుంది. దీంతో ఈ రోడ్డు మార్జిన్‌లో విక్రయించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, కోడి మాంసం, వేట మాంసంతో పాటు పావ్‌బాజీ, కోడి పకోడి, న్యూడిల్స్ తదితర చిరుతిళ్లు కలుషితమవుతున్నాయి. కొందరు తమ్మిలేరు గట్టుపై అపరిశుభ్ర వాతావరణంలో చేపల, రొయ్యలు విక్రయిస్తున్నారు. ఈ ఆహారం ఆరోగ్యానికి హానికరం అయినప్పటికీ గత్యంతరం లేని పరిస్థితిలో తినాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. శ్రీరామ్‌నగర్ 1వ రోడ్డులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో మార్కెట్ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఈ ప్రాంతంలో రైతు మార్కెట్ ఏర్పాటు చేయాలని భావించారు. ఇక్కడ ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు బజార్ అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరం



ఎంతోకాలంగా రోడ్డు పక్కనే మార్కెట్ నడుస్తుంది. ఇప్పుడు రోడ్డు అభివృద్ధి చెందింది. రోడ్డుపక్క దుకాణాలు పెరిగాయి. వాహనాలు వేగంగా వెళుతున్నాయి. ఈ సమయంలో రోడ్డుపక్క పిల్లలు, పెద్దలతో కలిసి వెళ్లి మార్కెట్ చేయడం ప్రమాదకరంగా మారింది. 24, 25 డివిజన్ల పరిసరాల్లో రైతు బజారు లేదు. రైతు బజారు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగకరం.

– గాయత్రి, శనివారపుపేట గ్రామస్తురాలు

మురుగు కూపం



శ్రీరామ్‌నగర్ 1వ రోడ్డులో చెరువు ప్రాంతం మురుగుకూపంగా మారింది. ఇప్పటికే చెత్తచెదారంతో ఈ చెరువు పూడిపోయింది. మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు, పాలకులు ఈ ప్రాంతాన్ని ప్రజలకు ఉపయోగపడేలా మార్కెట్‌గా లేదా పార్కుగా అభివృద్ధి చేయాలి.

– కేఎస్‌వీ సత్యవతి, శనివారపుపేట

క్రీస్తు బోధనలను అనుసరించాలి


బిషప్ జయరావును సత్కరిస్తున్న ఫాదర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శాంతియుత సమాజానికి ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు బోధనలను అనుసరించాలని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు సూచించారు. స్థానిక బిషప్ హౌస్‌లో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయరావు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీస్తు బోధనలను వివరించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని జయరావు సూచించారు. ఈ సందర్భంగా జయరావుకు పలువురు ఫాదర్లు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి ఆయన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెయింట్ మైఖేల్ చర్చి ఫాదర్ దిరిసిన ఆరోన్, నిర్మలగిరి మేరీమాత ఆలయ డైరెక్టర్ జాన్ పీటర్, ఏలూరు మేత్రాసనం ప్రొక్యురేటర్ ఫాదర్ బేతపూడి రాజు, నిర్మలగిరి అన్నదాన ట్రస్ట్ చైర్మన్ కళ్లే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాలల గర్జన మహాసభ పోస్టర్ విడుదల


పోస్టర్ విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 15న గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో నిర్వహించే మాలల గర్జన మహాసభను విజయవంతం చేయాలని రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి చాగంటి సంజీవ కుమార్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్‌ఎడీ పాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను స్థానిక జిల్లా పరిషత్ సెంటర్‌లోని పూలే దంపతుల విగ్రహాల వద్ద మంగళవారం వారు విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నిట్టా గంగరాజు, పల్లెం ప్రసాద్, మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, నేతల రమేష్ బాబు, ఎలిపే నరేష్, కనికెళ్ల మురళీ కృష్ణ, చింతా మహాలక్ష్ముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు రూరల్ : గుడివాకలంక సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. తిమ్మారావుగూడెం, కేడీపురం, గుడివాకలంక, మొండికోడు, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, కొక్కిరాయిలంక, కోమటిలంక, పెదయాగనమిల్లి గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జీజీహెచ్ గేటు వద్ద ఆటోలు పెడితే చర్యలు


డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

ఏలూరు టౌన్: ఏలూరు జీజీహెచ్ ప్రధాన ద్వారం వద్ద ఆటోలు అడ్డులేకుండా క్రమ పద్ధతిలో పెట్టుకోవాలని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ సూచించారు. మంగళవారం ఉదయం ఆయన ఆసుపత్రికి వచ్చారు. అత్యవసర విభాగం మెయిన్ గేటు వద్ద ఆటోలు అడ్డుగా ఉండడాన్ని గుర్తించి, ఆటో డ్రైవర్లను పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసరంగా వైద్యం కోసం వాహనాలతో వస్తూ ఉంటారని మెయిన్ గేటు వద్ద వాహనాలు అడ్డుపెడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీఎస్పీతో పాటు టూటౌన్ సీఐ వైవీ రమణ, టూటౌన్ ఎస్సై నాగ కల్యాణి పలువురు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక వారోత్సవాలు


మైమ్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో సాంస్కృతిక వారోత్సవాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పూల అలంకరణ, కూరగాయల అలంకరణ పోటీలు నిర్వహించారు. పూల అలంకరణలో 18 మంది, కూరగాయల అలంకరణ పోటీల్లో ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. మధ్యాహ్నం మైమ్, మోనో యాక్షన్, మిమిక్రీ పోటీలు నిర్వహించగా ఆయా పోటీల్లో 16 బృందాలు పాల్గొన్నాయి. ఆయా పోటీల్లో విజేతలను కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ శుభాకాంక్షలు తెలిపారు.

హక్కులకు భంగం కలిగిస్తే ఉపేక్షించొద్దు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మానవ హక్కులకు భంగం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్‌ఆర్‌పేటలోని ఎస్సీఆర్‌పీఎస్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో భారత రాజ్యాంగం, మానవ హక్కులు, నేటి ఎస్సీ క్రైస్తవుల స్థితిగతులు అనే అంశంపై ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కు కుల మతాలతో సంబంధం లేనిదన్నారు. ప్రొఫెసర్ ఎస్‌ఏడీ పాల్, నిట్టా ప్రసాద్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో పులవర్తి డేవిడ్, టి.సురేష్ బాబు, కె.మురళి, బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ ప్రతి పౌరుడూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు టీవీ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ హక్కులపై అవగాహన ద్వారా దోపిడీ నియంత్రించవచ్చునన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.రమేష్, ఎం విజయ్ కుమార్, ఎస్ పరమేశ, ఎం కృష్ణ చైతన్య, పీఆర్ కావ్యశ్రీ, ఎస్ సుస్యలత, డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు


ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): మహిళా హక్కులే.. మానవహక్కులు, మన హక్కులే.. మన భవిష్యత్తు అనే నినాదాలతో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక 44వ డివిజన్‌లో ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి ఎ.శ్యామల రాణిలు మాట్లాడుతూ భారతదేశంలో మానవహక్కులు క్షీణిస్తున్నాయని, ప్రపంచవ్యాప్తంగా 185 దేశాల్లో 109వ స్థానంలో మనదేశం ఉందని తెలిపారు. భేటీ బచావో అని చెప్పే ప్రభుత్వం రాజ్యాంగ స్థానంలో మనుధర్మశాస్త్రాన్ని తెచ్చి మహిళలు పోరాడి సాధించుకున్న హక్కుల్ని నీరుగార్చే ప్రయత్నంలో ఉందని ఆరోపించారు. ఆడపిల్లలకు రక్షణ కరువైందని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు నిరోధానికి కమిటీ ఉండాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు ఎక్కడా ఉనికిలో లేవని తెలిపారు. దీనికి కలకత్తాలో ట్రైనీ డాక్టర్‌పై ఘోర ఉదంతమే ఉదాహరణని చెప్పారు. మహిళలపై హింస, దౌర్జన్యాలను అరికట్టి దేశ పరువు ప్రతిష్ఠలు నిలబట్టేందుకు ఇప్పటికైనా పూనుకోవాలని వారు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జి.శారద, ఎం అరుణ కుమారి, జి.సోనిక, ఎస్ మహాలక్ష్మి, టి.సుకన్య, బి.ఇందుమతి, సీహెచ్ విజయ, సీహెచ్ కవిత, ఎస్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న సిబ్బంది, నాయకులు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు వినతి పత్రం అందించారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని పర్మినెంట్ కార్మికులకు జనరల్, స్పెషల్ ఇంక్రిమెంట్లు, మెడికల్ లీవ్ బిల్లులు, రిటైర్మెంట్ అయిన వారికి రావాల్సిన లీవ్ క్యాష్ మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఫిబ్రవరి నెల హెల్త్ అలవెన్స్ చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు ప్రతి ఏడాది భోగి పండగ రోజు యూనిఫాం, కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, కుట్టుకూలి ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.32 వేలు నెలకు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డిగర్ల నాగబాబు, యలగాడ శివకుమార్, బంగారు దుర్గాప్రసాద్, బంగారు రాజు, పొద్దుటూరు సురేష్, కరపాటి నాగరాజు, బంగారు మధు, ప్రసాదు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ మృతి

దెందులూరు: మతిస్థిమితం లేని మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న మహిళ మృతి చెందిందని దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామారావుగూడెం గ్రామానికి చెందిన అవివాహిత యువతి కాలి ఆశాజ్యోతి మతిస్థిమితం లేకపోవడంతోపాటు మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆమె మలకచర్ల, కండ్రిగ గ్రామాల మధ్య చెరువులో పడిపోవడంతో నీళ్లు తాగి మృతి చెందింది. మంగళవారం మృతదేహం చెరువులో పైకి తేలడంతో స్థానికులు గుర్తించి ఆమె కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారాన్ని తెలియజేశారు.

14న చర్చి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

దెందులూరు: రాష్ట్రీయ ముఖ్య కార్యదర్శి మసిలామోని స్టాలిన్ వైఎస్ కేజియల్ స్టాలిన్ ఈనెల 14న దెందులూరు రానున్నారని మంగళవారం జిల్లా డివిజనల్ కమాండర్ మేజర్ జల్లి మోషే తెలిపారు. స్థానిక గొడ వీధిలో నూతనంగా నిర్మించిన సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చిని ప్రారంభించేందుకు ఆయన వస్తున్నారని మోషే తెలిపారు. పర్యటన రూట్‌మ్యాప్, ఇతర ఏర్పాట్లపై స్థానిక కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య హైదరాబాద్ దైవజనులు పల్లె విశాల్, సంఘ పెద్దలతో చర్చించారు.

నేడు కొక్కిరపాడులో రెవెన్యూ గ్రామ సభ

పెదపాడు: కొక్కిరపాడులో రెవెన్యూ గ్రామ సభ బుధవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పంచాయతీ కార్యాలయం వద్ద, వేంపాడులో మధ్యాహ్నం 2 గంటల నుంచి స్థానిక కమ్యూనిటీ హాలు వద్ద గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

అతివేగంతోనే ప్రమాదాలు


మాట్లాడుతున్న డీటీసీ కరీమ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రోడ్డు ప్రమాదాల్లో సంభవించే మరణాల్లో అత్యధిక శాతం హెల్మెట్లు ధరించకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోందని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. మంగళవారం స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై ఏర్పాటుచేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అతివేగంగా వాహనాలను నడపడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వాహనాలు నడిపే సమయంలో ఖచ్చితంగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా జరిగిన 475 రోడ్డు ప్రమాదాల్లో 144 మంది ద్విచక్ర వాహనాలు నడిపే వారు ప్రమాదాలకు గురయ్యారని వివరించారు. అందులో 85 మంది ద్విచక్ర వాహనదారులు మృతి చెందారని తెలిపారు. కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు జి.ప్రసాదరావు, జగదీష్, పి.నరేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

థెరిస్సా అధ్యాపకులకు డాక్టరేట్


అధ్యాపకులను అభినందిస్తున్న సెయింట్ థెరిస్సా ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సెయింట్ థెరెసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో వివిధ విభాగాలకు చెందిన ఐదుగురు అధ్యాపకులు డాక్టరేట్ పొందారని ఆ కళాశాల ప్రతినిధులు తెలిపారు. వీరిని మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారని పేర్కొన్నారు. మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ సీనియర్ అధ్యాపకులు సుశీల మిద్దె మ్యాథమెటికల్ అప్లికేషన్ ఇన్ మోడలింగ్ అండ్ యుటిలైజేషన్ ఆఫ్ రోబోట్స్ ఇన్‌సిట్యుయేషన్ ఆఫ్ పాండమిక్ అనే అంశంపైనా, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యాపకురాలు ఎం షారోన్ సుష్మ పాలలో మైక్రో ప్లాస్టిక్‌లను గుర్తించడం, వాటి వర్ణన అనే అంశంపై పరిశోధనలు చేశారని తెలిపారు. ఆంగ్ల అధ్యాపకులు సిస్టర్ మరియా క్రిస్టియా పాపల్ ఎన్‌సైక్లికల్స్ సోషియో ఎన్విరాన్మెంటల్ ఎథిక్స్ రివ్యూ ఆఫ్ ద పీరియడ్ (1891..2020)పైనా, గాలి దుర్గా వైష్ణవి సమకాలీన రచయిత్రులు కవితా కేన్ నేటెడ్ రాసిన భారతదేశం, గ్రీక్ పురాణాల రచనల్లో స్త్రీ గుర్తింపు అనే అంశంపైనా, దాసరి మణి భాగ్యశ్రీ ప్రవాస సాహిత్యకారులైన చిత్ర బెనర్జీ దివాకరుని, అమ్మండ ఎలియట్ రచనల్లో పురాణాలు, జానపద సాహిత్యం అనే అంశంపైనా పరిశోధనలు చేశారు. వీరు డాక్టరేట్ పట్టాలు పొందారని పేర్కొన్నారు.

పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీలో తనిఖీ


పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీలో పర్యటిస్తున్న గండి బాబ్జి, రైతు నాయకులు, సిబ్బంది

పెదవేగి : ఆయిల్‌పామ్ రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని పెదవేగి ఏపీ ఆయిల్ ఫెడ్ పామాయిల్ ఫ్యాక్టరీ పర్సన్ ఇన్‌చార్జ్ గండి బాబ్జి అన్నారు. మంగళవారం పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలోని ప్లాంట్ విభాగాల పనితీరును ఫ్యాక్టరీ మేనేజర్ యు సుధాకర్ వివరించారు. అనంతరం గండి బాబ్జి మాట్లాడుతూ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్‌పర్సన్ ఫ్యాక్టరీ నిర్మించి 35 ఏళ్లు పూర్తయ్యిందని, తరువాత రూ.11 కోట్లు ఖర్చు చేసి మరమ్మతులు చేసినా నూనె దిగుబడి శాతం పెరగకపోగా, తగ్గిందని రైతు నాయకులు చెప్పడం బాధాకరమన్నారు. పెదవేగి ఫ్యాక్టరీని ఆధారంగా చేసుకుని జాతీయస్థాయిలో ఆయిల్ ధరలు నిర్ణయిస్తారని అన్నారు. ఇక్కడ రోజుకు 400 నుంచి 500 టన్నుల వరకు క్రషింగ్ జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రభుత్వంతో సంప్రదించి, త్వరలో నూతనంగా ఫ్యాక్టరీ నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ప్రచారాన్ని నమ్మవద్దని రైతులకు సూచించారు. ఫ్యాక్టరీ డిప్యూటీ మేనేజర్ ఎస్ శ్రీనివాసు, ఏఈఈ వై శ్రీనివాస్, రైతు నాయకులు ఉండవల్లి వెంకట్రావు, వీ రంగారావు, జీవీఎస్‌ఆర్‌కే ప్రసాద్, సర్పంచ్ తాతా శ్రీరామూర్తి, కార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, హమాలీలు ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	24
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు – తిరుపతి	16.00	4830	25

నేడు ఖోఖో పోటీలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో బుధవారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మహిళల ఖోఖో పోటీలు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ సత్తానియేలు తెలిపారు. మంగళవారం గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో ఆయన ఈ వివరాలు విలేకరులకు వెల్లడించారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

పంటల బీమా చెల్లించాలి

పెదపాడు: రబీలో అపరాలు సాగు చేసే రైతులు వెంటనే ఎకరాకు రూ.60 పంటల బీమా సొమ్ము చెల్లించాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొనిణి, నాయుడుగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ పసుసంవర్ధక శాఖ మత్స్యశాఖ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించే రైతులు ట్రక్ షీట్ జనరేట్ అయిన తరువాత ఎఫ్‌టీఓ వేలిముద్రలు వేస్తే ధాన్యం డబ్బులు త్వరితగతిన ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. రైతులతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ఆక్రమణల గుర్తింపు సర్వే

గణపవరం: గణపవరంలో ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమవుతోంది. మరో వారం పది రోజుల్లోనే పట్టణంలో ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించడానికి రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రోజులుగా పట్టణ పరిధిలో ఆక్రమణల గుర్తింపు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. నిరంతరం ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్న పిప్పర కూడలిలోనూ ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ రూపొందుతోంది. గణపవరంలోని పోలీస్ ఐలెండ్ సెంటర్ నుంచి ఇటు ఏలూరు రోడ్డు, భీమవరం రోడ్డు, తాడేపల్లిగూడెం రోడ్డు వైపున ఆక్రమణలను గుర్తిస్తున్నారు. ఇప్పటికే భీమవరం రోడ్డు వెంబడి సరిపల్లె శివారు వరకూ ఆక్రమణలను గుర్తించారు. గణపవరం పట్టణ పరిధిలోని మూడు ప్రధాన రోడ్లు ఆక్రమణకు గురయ్యాయి. డ్రెయినేజీని పూడ్చివేసి, రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి షెడ్లు నిర్మించి కొందరు వ్యాపారాలు చేస్తున్నారు. దీనితో రోడ్లు ఇరుకుగా మారి నిత్యం ప్రజలు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. దాదాపు అన్ని వ్యాపార దుకాణాల ముందు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి షెడ్లు నిర్మించారు. దీనితో ఆయా షాపుల వద్దకు వచ్చే వినియోగదారులు రోడ్డుపైనే వాహనాలను నిలిపి దుకాణాలకు వెళ్లడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీనితో గణపవరంలో ఆక్రమణలు తొలగించాలన్న డిమాండ్ ప్రజల నుంచి దశాబ్దకాలంగా వినిపిస్తోంది. ఇటీవల నారాయణపురం వద్ద భారీగా ఆక్రమణలు తొలగింపు ప్రారంభం కావడంతో గణపవరంలోనూ ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఆక్రమణల గుర్తింపు కార్యక్రమం పూర్తిచేసి నివేదికను తహసీల్దార్‌కు అందచేస్తామని సర్వే సిబ్బంది తెలిపారు. ఈనెల 14న నీటి సంఘాల ఎన్నికలు ఉండటంతో అవి పూర్తయిన అనంతరం ఆక్రమణల తొలగింపు పనులు ప్రారంభించే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.